# అభివృద్ధికి పట్టం కట్టండి

*సీఎం కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు*

- గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదు
- భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- మక్తానంతారంలో ఎన్నికల ప్రచారం



మక్తానంతారంలో బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 20 : భువనగిరి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి కోరారు. మండలంలోని మక్తానంతారంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రం వెనుకంజలో ఉండేదని, రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే గోసపడతారని తెలిపారు. అసైన్డ్ భూములకు హక్కు పత్రాలు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచి హక్కు పత్రాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగల్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ పసులాది లావణ్యాశ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు ధర్మబోయిన రాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



17వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కూతురు మన్వితారెడ్డి

## ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే పైళ్ల కూతురు మన్వితారెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 20 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కూతురు మన్వితారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16, 17వ వార్డులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. భువనగిరి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు కడారి ఉమాదేవీవినోద్‌కుమార్, చెన్న స్వాతీమహేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు గోమారి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వినోద్, నితీన్, సూరజ్ పాల్గొన్నారు.

## పైళ్ల శేఖర్‌రెడ్డి గెలుపు కోసం కంకణబద్ధులై ఉండాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు



చీమలకొండూరులో మాట్లాడుతున్న జనగాం పాండు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 20 : ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి గెలుపు కోసం కంకణబద్ధులై ఉండాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కేసారం, ముస్త్యాలపల్లి, చీమలకొండూరు, వడాయిగూడెంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ బల్లుగి మధుసూదన్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ కంచి మల్లయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాశ్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జిలుగు సతీశ్‌పవన్, కంకల కిష్టయ్య పాల్గొన్నారు.



అమ్మవారికి అభిషేకం చేస్తున్న రమణానందమహర్షి

## కాత్యాయనీదేవిగా అమ్మవారు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 20 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి పరిధిలోని రమణేశ్వరంలో శుక్రవారం అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సిద్ధగురు రమనానందమహర్షి అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు



కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ జైపాల్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 20 : మండలంలోని పెద్దపలుగుతండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీ కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలో రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు బానోతు లక్ష్మణ్, వీర పాండు, సంతోష్, శీను, కుమార్, నర్సింహ, శంకర్, విజయ్, మహేందర్, రాజ్‌కుమార్, రాజు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబర్ 20 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవొద్దని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వీరాబాయి, ఏఓ ఏజాజ్ అలీ ఖాన్, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- అక్రమంగా డబ్బు, మద్యం తరలింపుపై స్పెషల్ ఫోకస్
- తొలిసారిగా జీపీఎస్ వ్యవస్థ అమలు
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తాం
- నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో కలెక్టర్ హనుమంతు కె. జెండగే

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎన్నికల నిర్వహణపై శుక్రవారం నమస్తే తెలంగాణ నిర్వహించిన ఇంటర్వ్యూలో కలెక్టర్ హనుమంతు కె. జెండగే పలు విషయాలను వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

### అన్ని రకాల ఏర్పాట్లు..

ఎన్నికల సజావుగా జరిపేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మూడు స్టాటిస్టికల్ బృందాలతోపాటు మోడల్ కోడ్ టీంలు ఏర్పాటు చేశాం. ఇవి ఎప్పటికప్పుడు ఎన్నికల నిర్వహణను పర్యవేక్షిస్తున్నాయి. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. సరిపడా స్టాఫ్‌ను నియమించాం. అవసరమైతే మరింత మందిని ఉపయోగించుకుంటాం. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా 1905 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయొచ్చు లేదా సీ-విజిల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ప్రజలంతా సీవిజిల్‌ను ఉపయోగించుకోవాలి.

### జీపీఎస్ ద్వారా పర్యవేక్షణ..

ఎన్నికల కమిషన్ ప్రతి విషయాన్ని నిశితంగా గమనిస్తుంది. జీపీఎస్ ద్వారా నోడల్ బృందాలపై పర్యవేక్షణ ఉంటుంది. జీపీఎస్ అమలు ఇదే తొలిసారి. ఫిర్యాదులు వస్తే దగ్గరలో ఏ బృందం ఉందో జీపీఎస్ ద్వారా పరిశీలించి వెంటనే అలర్ట్ చేస్తాం. ఈవీఎంలను ర్యాండమైజేషన్ పద్ధతిలో పంపిస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తాం. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించాం.

### 4,39,100 మంది ఓటర్లు..

జిల్లాలోని భువనగిరి, ఆలేరు రెండు నియోజకవర్గాల్లో 4,39,100 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,19,792 మంది పురుషులు, 2,19,290 మంది స్త్రీలు, 18మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. భువనగిరి నియోజకవర్గంలో 2,11,362 మంది, ఆలేరు నియోజకవర్గంలో 2,27,738 మంది ఓటర్లు ఉన్నారు. మండలాల వారీగా చూస్తే భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి మండలంలో అత్యధికంగా 82,879మంది ఓటర్లు ఉన్నారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించి 566 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశాం. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటు ఉంది.

### అక్రమ డబ్బు, మద్యం రవాణాపై ఫోకస్..

అక్రమ మద్యం, డబ్బు రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. అక్రమ మద్యం రవాణాలో సాధారణమైతే బైండోవర్, తీవ్రంగా ఉంటే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తాం. బెల్ట్ షాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నాం. చెక్‌పోస్టుల వద్ద 24గంటల నజర్ పెట్టాం.

### ఓటు వినియోగంపై విస్తృత ప్రచారం..

నామినేషన్ల ఆఖరి రోజు వరకు కూడా ఓటు నమోదు చేసుకోవచ్చు. 18 సంవత్సరాలు నిండిన యువతను వివిధ ప్రచార కార్యక్రమాల ద్వారా ఓటర్లుగా నమోదు చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఓటరు హెల్ప్ లైన్ ద్వారా చెక్ చేసుకోవాలి. 2018లో రెండు నియోజకవర్గాల్లో 90శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఈ సారి పోలింగ్ శాతం మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

### డిజిటల్ లావాదేవీలపై నజర్..

అసాధారణమైన, అనుమానాస్పద ఖాతాల లావాదేవీలపై బ్యాంకర్లను అప్రమత్తం చేశాం. ఒక అకౌంట్ నుంచి అనేక ఖాతాలకు డబ్బు ట్రాన్సాక్షన్‌పై ఫోకస్ పెట్టాం. అభ్యర్థి నామినేషన్ వేశాక కొత్త అకౌంట్ తెరవాల్సి ఉంటుంది. అందుకోసం సకాలంలో సరైన చెక్‌బుక్స్ ఇచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇందుకోసం స్పెషల్ టీంను నియమించాం.

### రూ. 50వేలకు మించి తీసుకెళ్లొద్దు..

ఎన్నికల ప్రవర్తన నియామావళి ప్రకారం ఎవరైనా 50వేలకు మించి నగదుతో ప్రయాణం చేయవద్దు. ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకెళ్తే సీజ్ చేస్తాం. అత్యవసర వైద్యం, కాలేజ్ ఫీజులు, వ్యాపారం, వివాహం ఇతర అవసరాలకు తీసుకెళ్లే వారు సరైన పత్రాలు తీసుకెళ్లాలి. రాజకీయలు పార్టీలు కార్యక్రమాలు చేపట్టాలంటే సువిధ యాప్ ద్వారా పర్మిషన్ తప్పనిసరి.

## మొదటి విడుత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 20 : రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి విడుత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగే తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడుత ర్యాండమైజేషన్‌లో 25 శాతం అధికంగా బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ కేటాయించడం జరిగిందన్నారు. భువనగిరి నియోజకవర్గానికి సంబంధించి 257 పోలింగ్ కేంద్రాలకు 321 బ్యాలెట్ యూనిట్స్, 321 కంట్రోల్ యూనిట్స్, 359 వీవీ ప్యాట్స్ కేటాయించడం జరిగిందని, అదేవిధంగా అలేరు నియోజకవర్గానికి సంబంధించి 309 పోలింగ్ కేంద్రాలకు 386 బ్యాలెట్ యూనిట్స్, 386 కంట్రోల్ యూనిట్స్, 432 వీవీ ప్యాట్స్ కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఏ.భాస్కర్‌రావు, భువనగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అమరేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.